# భయం

బాబూ! ఒక్క పైసా ధర్మంచేయండి అనాదవాడినమ్మా, దయచూడండి.

మేలుకొలుపుల్లా వినబడిన ఈ మాటలతో విసుగ్గా కళ్లు తెరిచాడు వీరాసామి. "తెల్లవారిందిరా నీకు!" అంటూ మనిషన్నవాడి గుండె కరుగకపోతుందా అన్న ఆశతో మట్టిలో దొర్లుతూ దీనంగా మొరబెట్టుకుంటున్న బిచ్చగానివైపు ఒకసారి అసహ్యంగా చూసి లేచికూర్చున్నాడతను, త్రాళ్ళు తెగి వ్రేలాడుతున్న నులకమంచం ఆ బరువుకు బాధగా మూలిగింది. రొండిలో దోపిన చుట్టముక్కను వెదకి తీసి కొస కొరికి తుపుక్కున ఉమ్మి మరీ అంటించేడు వీరాసామి, మంచం ఎత్తి బడ్డీ పక్కనున్న కాళీస్థలంలో పెట్టేసి, చెక్కతో చేసిన బడ్డి తాళం తీసి తన సింహాసనంమీద విక్రమాధిత్యుని ఫోజులో కూర్చున్న వీరాసామి చిరాకుగా కసురుకున్నాడు.

"ఎందిరా నీగోల! తెల్లవారిన కాడినుండి సెవిగోసిన మేకలా అరుస్తుండావు గానీ ఎవుడన్నా కానిడబ్బు లిచ్చేడా!"

ఉన్న ఒక్క కన్నూ తిప్పి వీరాసామి వైపు క్షణకాలం చూసేడా బిచ్చగాడు. 'కాలేకడుపుమంట నీకేం తెలుసు?' అన్న తిరస్కారంవున్నదా చూపులో.

వాడి మొహంకేసి చూస్తున్న వీరాస్వామికి కడుపులో తిప్పినట్టయింది. తైల సంస్కారం లేక పీచులా నిలబడిన జుట్టూ, ముందుకు పొడుచుకువచ్చిన ఒక కన్నూ, రెండో కంటిని పూర్తిగా కప్పేసిన పులిపిరి కాయవంటి కాయ, ముడతలుపడి జారిపోయిన దవడలమధ్య కదలాడే కోరల్లాంటి రెండే రెండు పళ్ళూ, చీపురుపుల్లలా వ్రేలాడుతున్న కాళ్ళూ చేతులు చివర్ల మొండిగా వుండి చీమూ, నెత్తురూ గడ్డకట్టగా జుమ్మని ముసురుతున్న ఈగలూ... వాడి అవతారం చూడలేక తల తిప్పుకుని గెల క్రింది భాగంలో సగం కుళ్ళిపోయిన అరటిపండొకటి వాడి మీదికి విసిరేడు వీరాసామి.

కరకరలాడుతూ ఎండ ఎక్కువయ్యేకొద్దీ ఆరోడ్లో జనసంచారం ఎక్కువయింది. అనంతపురం మహా పట్టణంలో వుండే ఒక్క మెయిన్ రోడ్డునూ, కొత్త ఊరంటూ పిలవబడే

ప్రదేశాన్ని కలిపేదారి అది. అడ్డంగా వున్న రైలుపట్టాలు పరీక్ష తప్పిన విద్యార్థులకూ, దగాపడిన చెల్లెళ్ళకూ దారి చూపించడమేగాక పదికాలాల బాటు బ్రతకాలనుకొన్న వారినికూడా బలిగొనక పోలేదు. ప్రభుత్వంవారు కళ్ళు తెరచి బ్రహ్మాండమైన ఓవర్ బ్రిడ్జి కట్టించేరు. సొమ్ముకు సొమ్ము పోయి దిమ్ముకు దిమ్మూ పట్టెదేవరా' అన్నట్టు ఖర్చయితే చేసినా దాని నుండి ఈషణ్మాత్రమూ ప్రయోజనం కనబడలేదా పురప్రజలకు. చావుల సంఖ్య తగ్గకపోగా అటునుండి ఇటు బ్రిడ్జి మీదుగా రావడానికి రిక్షాలకూ, జట్కాలకూ, చెల్లించలేక బ్రిడ్జినీ, దానిని కట్టించిన వారినీ తిట్టిపోస్తున్నారు మధ్యతరగతివారు.

"బ్రిడ్జి మీద నుండి రైలుపోయే ఏర్పాటు చేసే తెలివి లేకపోయింది ముండా గవర్నమెంటుకి" అని వీరాసామి లాంటివాడు చార్మినార్ సిగరెట్స్ కోసమంటూ వచ్చి దారినపోయే ఆడపిల్లలకేసి చూస్తూ నిలబడే స్టూడెంట్స్‌తో నూటొక్క సార్లేనా అనివుంటాడు.

అనంతపురం పాలిట టాంక్ బండ్ వంటి బ్రిడ్జిని చూసి సంతోషపడ్డవాళ్ళూ వున్నారు. ముఖ్యంగా బలాదూరు తిరిగే కుఱ్ఱకారు. తలదాచుకోను నీడలేని అభాగ్యులకు ఆ బ్రిడ్జి క్రింద గూడు దొరికింది. "ఇక్కడంతా అంగళ్ళు పెడ్తారట" అంటూ మురిసిపోయిన వాళ్ళ ఆశలను వమ్ముచేస్తూ కొద్ది రోజుల్లోనే ఆ గూళ్ళన్నీ తినడానికి తిండీ, కట్టడానికి బట్టా కరవైన నిర్భాగ్యులతో నిండిపోయేయి. పనిచేసే వాళ్ళూ, అడుక్కుతినేవాళ్ళే కాక చిన్న చిన్న చెక్క సామాగ్రి చేసుకుని బ్రతికేవాళ్లూ, వేరుశనక్కాయలమ్మే సాయిబూ, వేడి వేడి అలసంద వడలమ్మే కుంటి ముసలిది కూడా వున్నారందులో, ఏ పనీ చేయలేని నిర్భాగ్యుడు వచ్చేపోయే వాళ్లను దీనాతి దీనంగా వేడుకుంటున్నాడు.

మాగిన మగ్గిన అరటిపండ్లు మీద మూగుతున్న ఈగల్ని పైకండువాతో తోలుతూ కూర్చున్న వీరాసామి టెంకాయ త్రాడు చివర నిప్పు ముట్టించి బడ్డీలో ఒక ప్రక్కగా వ్రేలాడగట్టేడు. ఒకరొకరుగావస్తున్న పిల్లకాయలను చూసి కాలేజీ టైమయినది గాబోలు ననుకొంటూ ఆవులించేడు.

ఆడపిల్లల స్కూళ్ళలో, కాలేజిలో పనిచేసే పంతులమ్మలూ, చదివే పిల్లలూ చాలామంది ఆ దారివెంబడి వస్తుంటారు. అందుకే వీరాసామికి బేరాలకేనాడు కొదువ వుండదు.

రైలు పట్టాలు దాటి వస్తున్న ముగ్గురమ్మాయిలను చూడగానే 'రూప్ తేరా మస్తానా ప్యార్‌మేరా దీవానా' అని విజిల్ వేస్తూ కిళ్ళీ బడ్డీనానుకొని నిలబడి పోజుకొట్టసాగేడొక టైట్ ప్యాంటువాలా. వాళ్ళు ముగ్గురు అక్క చెల్లెళ్లో లేక కూడపలుకు కొనికట్టుకున్నారో గానీ ముగ్గురూ నల్లని లంగాలమీద తెల్లని ఓణీలు వేసేరు. రెండు జడల్లో ఒకజడ ముందుకు వేసుకొని ఒక్కొటే ఒక్క మందారపువ్వు సింగారించేరు. పట్టాలుదాటి బడ్డీ దగ్గరగా వచ్చేదాక ఓరగా ఆ అబ్బాయిని చూస్తూ కామెంట్ చేసుకుంటున్న వాళ్ళల్లా "అమ్మాపైసా" అంటూ కాళ్ళకడ్డం పడిన బిచ్చగాడిని చూసి "ఇదొక న్యూసెన్స్ అయిపోతున్నదోయ్... మన కాలేజీకి వేరే దారివున్నా బావుండును" అని ద్వంద్వార్థంతో అంటూ జారిపోతున్న జార్జెట్ ఓణీని పైకి లాక్కుంటూ సాగిపోయారు వాళ్ళు. నవ్వుకుంటూ వెంబడించాడు రోమియో.

తాడు కొసన పేరుకున్న బూడిదను దులిపి దాని సహాయంతో మరొక చుట్ట ముట్టించాడు వీరాసామి. అరచి, అరచి నోరు నొప్పి పుట్టింది కాబోలు వాడి రాగం బిచ్చగాని పెళ్ళాం అందుకుంది. పండిపోయిన దానితల భూమికి తగులుతుందా అన్నంతగా వంగిపోయింది దాని నడుము. అక్కడ బొత్తిగా లాభం లేదన్నప్పుడు గొలుసున్న బల్ల చెక్కమీద వాడిని కూర్చోబెట్టి మెయిన్ రోడ్డుదాకా లాక్కుపోగలదది. కుంటివాడైనా, చావసిద్ధమైనా గానీ భర్తమీదే ఆధారపడిన పవిత్ర భారతనారి ఆ ముసల్ది.

"నడువ కాళ్ళు లేని కుంటివాడమ్మా... పైసా దరమం చేయండి తల్లీ" అంటూ ఒకే స్వరంతో అరిగిపోయిన రికార్డులా గోలచేస్తూంది. మామగారిచ్చిన టెర్లిన్ ప్యాంటు తొడుక్కుని, ఆడపిల్లలున్న క్లాసుకు పాఠం చెప్పే ఉత్సాహంలో గబగబ నడుస్తున్న, కొత్తగా పెళ్ళైన కుఱ్ఱ లెక్చరర్ దారినటకాయించిందా ముసల్ది.

"అంతా దొంగముండలు, ఒళ్ళు కొవ్వెక్కి అడుక్కోవడం... అయినా ఆడదాని రాజ్యం ఇంకెలా అఘోరిస్తుందిలే" పక్కనున్న బట్టతల మనిషితో అంటూ ఆగకుండా సాగిపోయాడతను.

బట్టతల పెద్దమనిషి వీరాసామి కొట్టుముందాగి వక్కపొడి కొనుక్కున్నాడు.

"ఆయమ్మొచ్చే టయిమయినాది కాబోలు" చిల్లర లెక్కపెడుతూ పట్టాలవైపొక చూపు విసిరాడు వీరాసామి. అంతలోనే ఎత్తుమడమల జోళ్ళతో తక్కుతూ, తారుతూ వచ్చిందో వయ్యారి. అయిదడుగుల పొడవుకు అరడుగు అదనంగా చేర్చిన సిగలో పెట్టిన గులాబీ పక్కకు జారిపోతుండగా, పాలరాతి నేలమీద డాన్స్ చేస్తున్నట్టు బాలన్స్ చూసుకుంటూ నడుస్తున్నదల్లా కాళ్ళకు అడ్డు పడ్డ బిచ్చగాడిని చూచి చీదరించుకుంటూ, గాగుల్స్‌లో నుండి బట్టతల కేసి ఓ చూపువిసిరి, వానిటీ బాగ్ ఊపుకుంటూ, లవెండర్ పరిమళాలు వెదజల్లి విసవిసా నడిచిపోయింది.

రాత్రి ఎనిమిదింటికి వీరాసామి కొట్టుకట్టేసేవేళకు, మొగుడిముందు పరచిన గుడ్డమీద పడివున్న నలభై ఎనిమిది పైసాలను చేతిలోకి తీసుకుంటూ "నీకుచావైనా రాదురా ముదనష్టపోడో "అని తిడుతోంది పతివ్రతయైన ముసలమ్మ.

X X X

"అయ్యో! నా దేవుడోయ్, నన్నొదలిపోయావురా" అంటూ కర్ణకఠోరంగా వినిపించిన రోదన స్వరంతో కళ్ళు తెరిచాడు వీరాసామి 'అప్పుడే తెల్లారిందా' అనుకుంటూ. ముందు రోజుదాకా ఏమూలో కొట్టుకున్న ముసలాడి ప్రాణం రాత్రి చలికి పైకి ఎగిరిపోయిందిలా వుంది. శోకాలు పెడుతూంది వాడి పెళ్ళాం.

"పీడ వదిలింది" అనుకున్నాడు వీరాసామి.

అరగంట కాకముందే శవంమీద గోచినికూడా వూడదీసేసి రోడ్డుపక్కగా పడుకోబెట్టి దహన సంస్కారంచేయడానికి దానం చేయమని దారినపోయే వాళ్లను ప్రాధేయపడసాగింది. భయంకరంగా చూస్తున్నట్టున్న కంటిమీద పది నయాపైసల నాణెంతో, ఈగలు ముసురుతూ నగ్నంగా వికృతంగా పడివున్న శవం మనిషి బ్రతుకు అర్థం చెబుతున్నట్టుంది.

చార్మినార్ సిగరెట్స్ కోసంగానీ, అమ్మాయిలకోసం గానీ ఆగకుండానే ముఖం చిట్లిస్తూ పావలాకాసు తీసి విసిరేసి చక్కా పోయాడు టైట్ పాంట్ వాలా. అతగాడి కోసం వెదుకుతున్న కళ్ళకు ఈ దృశ్యం కనబడగానే మంత్రగాడి దండాన్ని చూసి బెదిరి పారిపోయే దెయ్యాల్లా చేతి కొచ్చిన చిల్లర విసిరి పారిపొయ్యారు ముగ్గురమ్మాయిలు. రోడ్డు పక్కన శవానికి ఇందిరాగాంధీ ఎంతవరకు బాధ్యురాలో ఆలోచించకుండానే ఉదారంగా రూపాయనోటు విసిరేసి ఎవరో తరుముకొస్తున్నట్టు పోయాడు కుర్ర లెక్చరర్.

బట్టతల ఆసామి మాత్రం వక్కపొడి నములుతూ భగద్గీత గురించి వీరాసామికి బోధించసాగేడు. అంతలో దొంగచూపులు చూస్తూ వయ్యారంగా వస్తున్న అయిదడుగుల సుందరి శవాన్ని చూసి, అదిరిపడి, ఆ గాభరాలో పక్కకు తూలబోయి, సర్దుకొని, అర్ధరూపాయి బిళ్ళ తీసి ముసిల్దానిమీద గిరాటేసి బట్టతల ఆసామి వైపు చూడకుండానే హడావుడిగా వెళ్ళిపోయింది.

చీకటి పడ్డాక అప్పుడు తీరిగ్గా మున్సిపాలిటీ వారొచ్చి శవాన్ని తీసుకుపోతుంటే, సినిమా చివర్న వినిపించే జాతీయగీతంలా మరొక్కసారి గొల్లుమంది ముసిల్ది.

డబ్బు లెక్కపెడుతున్న ముసిల్దాన్ని చూసి నవ్వుకుంటూ, "ఎంతొచ్చినాదేటి?" అని అడిగాడు వీరాసామి.

"నా బొందలే... పది రూపాయల చిల్లరేమో... అంతే..." ముక్కు చీదుకుంటూ అంది ముసిల్ది. ఓ యబ్బ! సచ్చినాకే సంపాదన హెచ్చినాదే మీ వోడికి" అంటూ నులకమంచం వాల్చుకున్నాడు వీరాసామి.

'పసి పిల్లలు చీకటిని చూసి భయపడినట్టు మనుష్యులు మృత్యువుకు భయపడతారని' ఒక మహానుభావుడు ఏనాడో చెప్పాడన్న విషయం తెలియని వీరాసామి కాసేపటిలో నిద్రలోకి జారిపోయేడు.

"కామధేను" మాస పత్రిక

తేది : ఫిబ్రవరి, 1972.